• కథానిక

# నేనూ నాన్ననవుతాను

— ఎం.ఆర్. అరుణాసహదేవ్.

“ఏమండీ! ప్లీజ్! గట్టిగా అరచింది. అవతల అత్తయ్యా మామయ్యా–బాధపడ్తారు. అసలే అత్తయ్యా హార్ట్ పేషెంట్...” సౌమ్య అరగంటనుండీ బ్రతిమలాడ్తోంది శ్రీకాంత్‌ను.

“హు! హార్ట్ పేషెంట్! గుండె జబ్బు... దుబ్బ రొట్టెలా దిట్టంగా వుంది. ఆవిడకేం జబ్బూ లేదు., ఊరికే ... అన్యాయంగా... జబ్బు పేర్చెప్పి... నా బతుకే గబ్బు పట్టించారు. నాకు మనశ్శాంతి లేకుండా చేస్తారా... ప్చ్! ఏమే! ఎందుకే అందరూ కలిసి నన్నిలా చిత్రహింస చేస్తారు? పోనీ... ఇంత... ఇంత విషమిచ్చేయ్యవే.. నాకు...” శ్రీకాంత్ నిలబడలేక మంచం మీద కూలబడ్డాడు

“ఏమండీ! ఏమిటా మాటలు? మీరు గమ్మున పడుకోండి...” సముదాయింపుగా ఏదో చెప్పబోతూంది సౌమ్య.

“ఏంటే అన్నావ్...” చివాల్న లేచి సౌమ్య జుట్టు ఒడిసిపట్టుకొన్నాడు శ్రీకాంత్.

“గమ్మున పడుకోనా? గమ్మున... అంటే ఏంటే నీ ఉద్దేశ్యం? నేనేం చాతకాని వాడిననా? చాతకాని వాడికి ఉత్త మాటలే నా? ఎంత ధైర్యమే నీకు...నిన్ను... చంపేస్తా... రాస్కెల్!”

“అబ్బా!...” తలస్నానం చేసిన జుట్టు భర్త పిడికిట్లో గుంజబడ్తూంటే నొప్పికి గిలగిల్లాడి పోయింది సౌమ్య. “ఏమైందండీ ఇవాళ మీకు? ప్లీజ్! జుట్టు వదలండి... అబ్బా...” అతని చేతుల్ని బలవంతంగా లాగుతూ, బాధగా అడిగింది. “ఎందుకివాళింత ఎక్కువ తాగారు? ఏం జరిగింది?”

“ఏం జరిగిందా? ఏం జరుగుతుందో నువ్వు... నాకు చెవ్తున్నావా? అంతా... నీ ఇష్టమైపోయింది కదా... అడిగేవాళ్ళు లేరనీ...” మాట ముద్దముద్దగా వస్తోంది. అమె జుట్టు వదిలి మంచంపైన కూచున్నాడు మళ్ళీ.

“మీకు చెప్పకుండా నేనేం చేస్తున్నాననీ?” అయోమయంగా చూసింది సౌమ్య. చిక్కులు పడ్డ జుట్టు విదిల్చి ముడేసుకుంటూ.

“చెవ్తున్నావ్! ఏం చేస్తున్నావ్! శేఖర్‌గాడి పెళ్ళాం... అదే డాక్టర్ అనురాధ... క్లినిక్‌కు వెళ్ళావట! చెప్పావా నాకు?” నిలదీసినట్లు ప్రశ్నించాడు శ్రీకాంత్

ఉదయం శ్రీకాంత్ ఆఫీసుకు వెళ్ళిపోయాక అనురాధ ఫోన్‌చేసి అర్జంటుగా రమ్మంటే ఏమిటోనని వెళ్ళింది. శ్రీకాంత్ మధ్యాహ్నం ఇంటికే రాలేదు. ఇప్పుడొచ్చీ రాంగానే పొట్లాట పెట్టుకున్నాడు. ఎప్పుడు, ఎలా చెప్పేయ్యగలదు తను?

“ఆవిడ్తో ఏమని చెప్పావ్? ఏం ఊరంతా టముకు వేస్తున్నావా? టముకు? నీ కసలు.. సిగ్గనిపించటం లేదా? నువ్వసలు ఆడదానివేనా? అలా చెప్పకోవటానికి నీకు నామోషీగా లేదూ?” అతని గొంతు వణుకు వల్ల కీచుగా వచ్చింది.

“ఆడదాన్ని కదా! ఉన్న మాట చెప్పకోవడానికి నామోషీ ఎందుకు?” నిర్లిప్తంగా చెప్పింది సౌమ్య.

“అంటే... అంటే... మగవాళ్ళు అబద్దాల్తారు. మీ ఆడవాళ్ళు మాత్రం సత్యహరిచ్చెంద్రుడి చెల్లెళ్ళు... కూతుళ్ళూ...! మాకు వున్నమాట చెప్పకోడానికి నామోషీనా?” శ్రీకాంత్ కోపంతో రెచ్చిపోతూ లేచి, సౌమ్య చెంపలపై ఈడ్చి కొట్టాడు.

సౌమ్య ఆ దెబ్బలకు తూలి కిందపడబోతూ మంచం ఆసరాతో అలాగే కూర్చుండి పోయింది నివ్వెరపాటుతో. పెళ్ళయిన అయిదేళ్ళలో తొలిసారి చెయ్యి చేసుకున్నాడు శ్రీకాంత్, అతని కంతగా కోపం తెప్పించే మాటః. తను అని వుండకూడదు. పొరపాటు తనదే. మండుతున్న చెంపను తడుముకొంది. అమె కళ్ళల్లో కన్నీటి మేఘాలు కమ్ముకుంటున్నాయి వర్షించటానికి సిద్ధంగా!

“అవునే! నేను నామోషి పడ్డాను. ‘నేను నాన్నను కాలేదు’ అని చెప్పకోటానికి నేను నామోషీ పడ్డాను. కాని నువ్వు చెప్పచ్చావుగా! వాడు ఉరంతా టముకు కొడ్తున్నాడు. పైగా పెళ్ళి సంబంధాలు చూస్తాట్ట! రెండో పెళ్ళి చేస్కోవాల్ట! అసలు వాడి మరదలే వుందట. దాన్ని చేస్కోవాల్ట! పైగా కట్నం కూడా ఇస్తాట్ట! వెధవ!....” ఆవేశంతో మనిషి తూలిపోతున్నాడు. “వాడికెంత ధైర్యం? నీకు విడాకులిమ్మని చెప్తాడా? దొంగ... నాయాలు....”

సౌమ్య అతని మాటలు ఆశ్చర్యంగా వింటోంది. అనురాధ ఎంత పని చేసింది? ఎంతో ప్రేమగా ఫోన్‌చేసి రమ్మంది అర్జంటుగా. ఏమిటోనని తను వెళ్ళింది ఆదుర్దాగా!

‘పెళ్ళయి అయిదేళ్ళవుతున్నా పిల్లల్లేక పోవటమేంటీ, టెస్టులు చేస్తానంది. అవసరమైతే డి అండ్ సి చేస్తానంది. ఏడాది తిరిగేలోవు బిడ్డనెత్తుకొనేలా చేస్తానంటూ తనను బలవంతంగా లోపలికి లాక్కుపోబోతుంటే తను గట్టిగా ప్రతిఘటించింది. ఆ టెస్టులు, ఆపరేషన్లు అన్నీ అయ్యాయని, అవసరం లేదనీ చెప్పింది.

“అయితే శ్రీకాంత్‌ను టెస్ట్ చేయాలి. రమ్మని ఫోన్ చేయమంటూ ఫోన్ తనముందుకు తోసింది. తను నవ్వుతుంటే ఆశ్చర్యపోయింది. నవ్వదా మరి! లోపం తనలో వుంచుకొని శ్రీకాంత్‌ను నిందించటంలో అర్థమేముంది అనవసరంగా అతన్ని బాధపెట్టడం తప్ప? అదే చెప్పేసింది. ఏమాత్రం మొహమాట పడకుండా!

“గర్భసంచి చాలా చిన్నదిగా వుందిట. పిల్లలు పుట్టే అవకాశం లేదు” అప్రయత్నంగానే తన గొంతు వణికింది. కప్పిపుచ్చుకోటానికనట్లు తను నవ్వేసింది.

నవ్వుతున్న తనవేపు ఆదోలా చూసింది. “మరి శ్రీకాంత్... పిల్లలు కావాలని... లేదనీ... బాధపడటం లేదా?” కుతూహలంగా చూసింది. “మళ్ళీ పెళ్ళి...” తన మొహంలో రంగులు మారటం చూసి ఆగిపోయింది”... అదే... బోలేదు ఆస్తిపాస్తులు... పైగా ఇంజనీరు... వారసులు లేకపోతే ఎలా?” సాలోచనగా తనవైపు చూస్తున్నప్పుడే చెల్లెల్నిచ్చి పెళ్ళి చెసేయ్యాలన్న ఆలోచన వచ్చేసిందేమో! తను లేచి వచ్చేస్తున్నా మాట్లాడనే లేదు. ఇంతలోనే భర్తతో మాట్లాడి, శ్రీకాంత్‌ను కూడా అడిగించేసిందంటే... స్వార్థం ఎంత చెడ్డదో, ఎంత వివేక శూన్యమైనదో.. విచక్షణా రహితమైనదో అర్థమవుతుంది. తెల్లని వన్నీ పాలు... నల్లని వన్నీ నీళ్ళు అన్నట్లుగా... ప్రేమగా, తీయగా మాట్లాడే మాటల వెనుక మంచితనమే దాగుందని గుడ్డిగా నమ్మేయ్యకూడదనీ తెలిసి వస్తోంది. అనుభవాన్ని మించిన పాఠం మరొకటుండదు కదా!

“ఏయ్? వింటున్నావా?” భర్త భుజంపట్టి కుదువుతుంటే ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది సౌమ్య.

“చెప్ప మరి! రెండో పెళ్ళి చేసుకోమ్మంటావా?” గట్టిగా నవ్వాడు. “విడాకులిచ్చేస్తావా?” అతను నిస్సత్తువుగా మంచానికడ్డం పడిపోయాడు. “విడాకులిచ్చెయ్! అవును... నాకు విడాకులిచ్చేసి... నువ్వు... నువ్వు ఇంకో పెళ్ళి చేస్కో!” అతను దిండు లాక్కుని, మొహన్నందులో దాచుకున్నాడు. అశాంతిగా, అసహనంగా తల నటూ ఇటూ తిప్పతున్నాడు.

“నో! నా వల్లకాదు. నేనీ బాధ భరించలేను. ప్రతివాడూ గుచ్చి గుచ్చి, గిచ్చి మరీ అడిగేవారే! ‘నీకు పిల్లల్లేరా? నీకు పిల్లలేరా!’ అని! అసలు నా గురించి వాళ్ళ కెందుకూ? ... నాకు పిల్లల్లేకపోతే

న్యూజెర్సీ తెలుగుకళా సమితి, రాజాలక్ష్మీ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

వాళ్లకేంటి నష్టం? 'పిల్లనిస్తా పెళ్లి చేస్కో'.... అని వెంటబడ్డానికి కాపోతే...."

ఎన్నాళ్ళుగా రగులుతుందో అగ్ని పర్వతం? ఇవాళ్టికి బ్లో అవుటైపోయి, మంటల మంటలు విరజిమ్మబడ్తున్నాయి. సౌమ్య అతనివేపు బాధగా చూస్తోంది. ఎంత తాగినా వచ్చి ఒక్క మాట మాట్లడకుండా పడుకొనేవాడు. మరీ ఏదైనా ఎక్కువ బాధనిపిస్తే... ఆమె ఒళ్ళో పడుకొని కాసేపు వాగి అలాగే నిదురపోయేవాడు. ఆమెను గట్టిగా పట్టుకొని చిన్నపిల్లడిలా!

"... మీరేం చెప్పినా... ఎంత తాగించినా... నేను మీ... బుట్టలోపడను. పోండిరా... వాయాళ్ళలారా! నా పెళ్ళాం... నా సౌమ్య... దాన్నొదిలి నేను బ్రతగ్గలనా? నాకు.. నాకు... పిల్లలొద్దు... సౌమ్య.. సౌమ్యే కావాలి... నా కింకెవరూ... వద్దు... దానికి. నేనే బిడ్డ... నా కదే... బిడ్డ... దట్సాల్... చాలంతే!....."

సౌమ్య లేచి భర్త తలను ఒడిలోకి లాక్కుని, అతని జుట్టు ఆప్యాయంగా నిమరుతోంది. అతను ఏదేదో మాట్లాడ్తూనే వున్నాడు. అలా మాట్లాడ్తూనే... అలాగే... నిద్రలోకి జారుకున్నాడు.

భర్త మనసులో తనపట్ల గల చెక్కుచెదరని ప్రేమ... పిల్లల్లేరన్న ఆక్రోశం... ఆ ఆక్రోశవు పండును పొడిచే కాకుల్లాంటి లోకుల వల్ల పెల్లుబికుతున్న ఆవేదన - గాంభీర్యమనే తలవుల మాటున భద్రంగా దాచుకొంటే... ఈ వేళ... ఈ తాగుడు తాళం పగులగొట్టి... డ్యాం గేట్లు తీస్తే ప్రవహించే నీళ్ళల్లా....ప్రవహిస్తున్నాయి.

సౌమ్య గుండెల్లోంచి దుఃఖం ఎగదన్నుకు వస్తోంది. ఆమె కన్నుల పర్వత సానువుల్లోంచి కన్నీటి జలపాతాలు ఉరుకుతున్నాయి. పారే నీటికి ఆనకట్ట కట్టగలరు. దూకే జలపాతాన్నెవరు అడ్డుకోగలరు?

** ** **

అంతవరకు నిద్రనటిస్తూ పడుకొని వున్న సుందరంగారు నెమ్మదిగా లేచి పక్కకు చూశారు. అటువేపు తిరిగి పడుకొని నిద్రపోతుంది సరోజమ్మ.

చప్పుడు చేయకుండా లేచివెళ్ళి కిటికీ పక్కనున్న కుర్చీలో కూచున్నారు. కిటికీ కావలివేపు చూశారు. కన్పించినంత మేరా చీకటి! చీకటి ఒడిలో ప్రకృతి కొంత ఒదిగిపోతే- అనంతమైన శూన్యం-భ్రమ కాదా! వున్నా కన్పించలేనిది నిజం కాదా! ఏది నిజం! ఏది భ్రమ?

"భ్రమలు, ఊహలు, కలలు- జీవితానికి పునాదులు కావని, కాలేవని "తను అనాడే చెప్పాడు. 'తాగుబోతయిన తన కొడుకుతో సుఖపడలేవ'ని సౌమ్యను తను ముందుగానే హెచ్చరించాడు.

పెళ్ళిచూపుల్లో- మొదటి చూపులోనే ప్రేమించేసిన అమ్మాయితో జీవితాన్ని పంచుకోబోతున్నానన్న సంతోషం మిగులుతున్న కలల బరువు కన్రెప్పలు



బరువెక్కి- వాలిన రెప్ప పాటులో- ఆక్సిడెంట్ జరిగిపోయింది శ్రీకాంత్‌కు

'నిశ్చితార్థం చేసుకొని వస్తున్నప్పుడే ఆక్సిడెంట్. ఆ ముద్దనష్టపు జాతకపు పిల్ల నా కోడలిగా రావటానికి విల్లేదం'టూ సరోజమ్మ పట్టుబట్టింది.

'నా కసలు పెళ్ళే వద్దం'టూ శ్రీకాంత్ పంతం- తాగుడులోకి దించింది.

'పెళ్ళంటూ చేసుకుంటే శ్రీకాంత్‌నే' అంటూ సౌమ్య హఠం!

ఎవర్తో ఏం మాట్లాడాలో, ఎలా వచ్చచెప్పాలో తోచని అయోమయ పరిస్థితుల్లో తాను! చివరకు తాను ధర్మాన్నే నమ్ముకొన్నాడు. 'ధర్మో రక్షిత రక్షః' ఒక ఆడపిల్ల జీవితం చేజేతులా నాశనం చెయ్య లేదు కదా! కాని సౌమ్య ఎంత చెప్పినా విన్లేదు. అతని కోసం తనేమైనా చెయ్యడానికి సిద్ధమేనంది.

"దంపతులైన స్త్రీ, పురుష సంబంధంలో సుఖం- వంటా, చాకిరి, పిల్లల్ని కనడం, పెంచడంలోనే వస్తుందా? అసలు సుఖానికి కొలబద్ద తృప్తే కదా! ఎక్కడికక్కడ తనకు ప్రాప్తమైన దాన్తోనే సంతృప్తి పడేవారి సుఖానికి లోటన్నది ఎప్పుడూ వుండద'ని వాదించింది.

"మనస్ఫూర్తిగా ఒకర్నొకరు కోరుకొంటున్న మమ్మల్ని విడదీయకండి..." అంటూ రెండు చేతులూ జోడించి, దగ్గుత్తితో... కళ్ళనీళ్ళతో... సౌమ్య కంటతడి ఇంకా.. ఆరనే లేదు? కొడుకు కాపురం కలతల ఒరిపిడిలో నలిగిపోతూనే వుందా?

"ఏమిటి, మీరు కూడా చిన్నపిల్లాడిలా!"

ఎప్పుడులేచి వచ్చిందో, సరోజమ్మ! చెంపలపై వార్ధక్యం తవ్విన ముడతల కాలవల్లో జారుతున్న కన్నీటిని తుడుస్తూ మందలింపుగా అంటూంటే... ఉలిక్కిపడి చూశారు సుందరంగారు.

కొడుకు పెళ్ళి వద్దంటున్నాడన్న బెంగతో గుండె జబ్బు తెచ్చుకొని మంచాన పడ్డ తల్లి కోసం- సౌమ్య మెడలో మూడుముళ్ళు వేసిన కొడుకు- మనసు చిక్కుల ముడులు పట్టి, ఉక్కిరి బిక్కిరైపోతుంటే ఆవిడకు మాత్రం బాధగా లేదా?

"సరోజా..." భార్య చేతిని పట్టుకొంటూ, గుండె గొంతుకల మధ్య కొట్టుకులాడ్తున్న ఆవేదనా గరళాన్ని మింగలేక, కక్కనూలేక... బేలగా చూశారు.

"మన చేతుల్లో ఏముంది? అంతా ఆ పైవాడి లీల!" వైరాగ్యంతో కూడిన భార్య ఓదార్పు గాలం- ఆయన మానస సరోవరంలా మునకలేస్తున్న ఓ నిట్టూర్పును లాక్కువచ్చింది భారంగా!

** ** **

ఆ రోజు ఆదివారం. ఆరు రోజుల పనిదినాల తర్వాత ఆట విడుపునిచ్చే విశ్రాంతి దినం. అలసిన శరీరాన్ని, యాంత్రికతతో విసిగిన మనసునో స్వాంతన పరచి, నూతనోత్సాహాన్ని నింపే- ఏ పిక్నిక్కో, సినిమానో, షికారో తీసుకెళ్ళే దినం?

శ్రీకాంత్ దంపతులు బీచ్‌లో నడుస్తున్నాను సౌమ్య చేతుల్లో ఏడాది బాబు కేరింతలు కొడ్తూ నవ్వుతున్నాడు. శ్రీకాంత్ చేతిని తన రెండు బుల్లి బుల్లి చేతుల్తో పట్టుకొని గుంజుతూ "నాన్నా! ఐస్‌క్రీం..." అని గునుస్తోంది మూడేళ్ళ పాప.

"తీసుకొందాం రారా! ఇసుకలో నడవలేవు తల్లీ!" అంటూ పాపను ఎత్తుకొన్నాడు శ్రీకాంత్.

తననూ ఎత్తుకోమన్నట్లు చేతులు చాపుతూ దూకుతున్నాడు సౌమ్య చేతుల్లో వున్న బాబు శ్రీకాంత్‌ను చూస్తూ. వాడిని పట్టుకోవటం కష్టమైపోతుంది సౌమ్యకు. మరో చేత్తో వాణ్ణి ఎత్తుకొని, ఇద్దర్నీ గుండెలకు హత్తుకొని నడుస్తున్నాడు శ్రీకాంత్.

"తల్లిదండ్రుల ప్రేమను పంచగల్గే పెద్దమనసే మనకుండాలేగాని, తల్లిదండ్రుల ప్రేమకోసం తపించిపోతున్న బిడ్డలెంతమంది లేరు? 'నాది' అనే అహంకారాన్ని, 'నా రక్తం' అనే సంకుచిత్వాన్ని విడిచిపెట్టగల్గితే!"

అత్తగారి మాటలు తమిద్దరి మస్తిష్కాలను ఆలోచనా కవ్వంతో మధించాయి. మధనపెట్టాయి. అపనమ్మకాల, అపోహల- హలాహలాన్ని పట్టించుకోకుండా పట్టుదలగా సాధించిన అమృత ఫలాలే... ఈ పిల్లలు!

"ఏమిటి, ఆగిపోయావు. నువ్వూ నడవలేవా? నిన్నూ ఎత్తుకోనా?"

కొంటెగా ప్రశ్నిస్తున్న శ్రీకాంత్ వేపు సజల నయనాలతో చూస్తూ అడుగు ముందుకేసింది సౌమ్య సన్నగా నవ్వుతూ.

ఆక్సిడెంట్‌లో సంతాన భాగ్యాన్ని కోల్పోయినా, విశాల హృదయంతో ఇద్దరు అనాధ పిల్లల్ని దత్తు చేసికొని-

'నేనూ నాన్ననైనా'నని ఆనందంతో మెరుస్తున్న కళ్ళనిండా ఆర్తిని, ఆప్యాయతను నింపుకొని భార్య వేపు చూస్తున్నాడు శ్రీకాంత్.